
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కడప
జిల్లా వార్తలు


5

సోమవారం 13 అక్టోబరు 2025

ఐదేళ్ల జగన్ పాలనంతా బాదుడే బాదుడు.. నవరత్నాల పేరిట కొందరికే లబ్ధి చేకూర్చి నవరత్న ఆయిల్‌ను అన్ని వర్గాలకు పూశారు. ఆర్టీసీ బస్సు చార్జీలు మొదలుకుని.. చెత్తపన్ను వరకు ఇలా ఒకటేంటి.. ఇష్టారాజ్యంగా పన్నుల మోత మోగించారు. ముఖ్యంగా ట్రూఅప్ పేరిట విద్యుత్ చార్జీలను భారీగా పెంచి జనాల నెత్తిన బండ వేశారు. రూ.200 కూడా రాని కుటుంబాలకు రూ.వెయ్యి నుంచి రూ.1500కు పైగా రావడంతో లబోదిబోమన్నారు. అయినా జగన్ అండ్ కో డోంట్ కేర్ అనడంతో దీనిపై అప్పట్లో పెద్ద విమర్శలు వచ్చాయి. కాగా చంద్రబాబు ఇచ్చిన ఎన్నికల హామీల్లో భాగంగా నవంబరు బిల్లు నుంచి చార్జీలు తగ్గనుండంతో ప్రజల నుంచి హార్షం వ్యక్తమవుతోంది.

ట్రూడౌన్


● జగన్ హయాంలో బాదుడే బాదుడు



● ట్రూఅప్ పేరిట భారీగా పెరిగిన విద్యుత్ చార్జీలు
● బిల్లులు పట్టుకుంటేనే షాక్ కొట్టేలా మోత
● అధికారంలోకి వస్తే విద్యుత్ బిల్లులు తగ్గిస్తామంటూ చంద్రబాబు హామీ
● తొలిసారిగా ట్రూఅప్ చార్జీలు తగ్గింపు
● రూ.27.64 కోట్లు తగ్గనున్న భారం
● సుమారు 7లక్షల మందికి లబ్ధి
● నవంబరు నెల బిల్లు నుంచి సర్దుబాటు

(కడప-ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో భారీగా పెరిగిన విద్యుత్ చార్జీలను తొలిసారిగా చంద్రబాబు సర్కారు తగ్గుముఖం పట్టిస్తోంది. ఎన్నికల సమయంలో విద్యుత్ చార్జీలు పెంచమని ఇచ్చిన హామీలో భాగంగానే జనంపై భారం మోపకుండా ట్రూడౌన్ పేరుతో ప్రజలకు మేలు చేకూరుస్తున్నారు. జిల్లాలో 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు వినియోగించిన కరెంటుకు సంబంధించి యూనిట్‌కు సుమారు 0.13 పైసల చొప్పున తిరిగి చెల్లించనున్నారు. అంటే 2024-25 సంవత్సరంలో 2081.66 మిలియన్ యూనిట్స్ వాడారు. ఆ యూనిట్‌కు సంబంధించి యూనిట్‌కు 0.13 పైసల చొప్పున మొత్తం రూ.27.64 కోట్లు నవంబరు నుంచి ప్రతి నెల వినియోగదారుల బిల్లుల్లో జమ కానుంది. జిల్లాలో గృహ వినియోగదారుల కనెక్షన్లు 602507 కమర్షియల్ 70167, ఇండస్ట్రియల్ 3223, ఇతర కనెక్షన్లు 18902 కనెక్షన్లు ఉన్నాయి. మొత్తం కనెక్షన్లు 694799గా ఉన్నాయి. చార్జీల ట్రూడౌన్‌తో సుమారు 7 లక్షల మంది వినియోగదారులపై భారం తగ్గనుంది.

ట్రూఅప్ చార్జీల సర్దుబాటు ఇలా



జగన్ హయాంలో విద్యుత్ చార్జీల బాదుడు అన్ని వర్గాలను తాకింది. జగన్ ఘోరాతిఘోరంగా ఓడిపోవడానికి ఇది కూడా ఓ ప్రధాన కారణమే. అయితే విద్యుత్ చార్జీలు పెంచబోమని చంద్రబాబు హామీ ఇచ్చారు. అందుకు తగ్గట్లుగా చార్జీల భారం తగ్గించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది.. తొలిసారిగా ట్రూడౌన్ అవుతున్నాయి. 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు వినియోగించిన యూనిట్లకు ఒక్కో యూనిట్‌కు 0.13 పైసల చొప్పున తగ్గించివేసి ఆ బిల్లును వచ్చే నెల నవంబరు నుంచి సర్దుబాటు చేయనున్నారు. ఉదాహరణకు.. ఆ ఏడాది కాలంలో ఓ వ్యక్తి 2600 యూనిట్లు వినియోగించి వుంటే ట్రూడౌన్‌లో రూ.338 తగ్గుతుంది. గత ఏప్రిల్‌లో ఓ వ్యక్తి 200 యూనిట్లు వినియోగించి వుంటే అందుకు సంబంధించి నవంబరు ట్రూడౌన్ చార్జీలు రూ.26 బిల్లులో సర్దుబాటు అవుతాయి. దీంతో జిల్లా వ్యాప్తంగా రూ.27,64,45,765 వినియోగదారులకు జమకానుంది.

నెల/ సంవత్సరం	గృహ వాణిజ్య చిన్నతరహా పరిశ్రమలు	భారీ పరిశ్రమలు	మొత్తం కనెక్షన్లు	వినియోగదారుల ఖాతాల్లో రీఫండ్ (రూ.కోట్లలో)	నెలవారీ జమ
04/2024	93561220	101501680	195062900	25904353	నవంబరు-25
05/2024	104785546	90030853	194816399	25871618	డిసెంబరు-25
06/2024	103531835	95764647	199296482	26466573	జనవరి -26
07/2024	87378545	81349510	168728055	22407086	ఫిబ్రవరి -26
08/2024	88147394	93842261	181989655	24168226	మార్చి -26
09/2024	94326369	88446572	182772941	24272247	ఏప్రిల్ -26
10/2024	86827183	107182796	194009979	25764525	మే - 26
11/2024	87674297	81602600	169276897	22479972	జూన్ - 26
12/2024	75289682	80053649	155343331	20629594	జులై - 26
01/2025	71157459	72548892	143706351	19084203	ఆగస్టు - 26
02/2025	68496996	79214281	147711277	19616058	సెప్టెంబరు-26
03/2025	75133389	73822259	148955648	19781310	అక్టోబరు -26
మొత్తం	1036309915	1045360000	2081669915	276445765	

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్: డీఆర్వో

కడప కలెక్టరేట్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సభా భవనంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీదారులు వినతులు సమర్పించి సమస్యకు పరిష్కారం పొందాలని ఆయన కోరారు. ఉదయం 9-30 నుంచి డయల్ యువర్ కలెక్టర్, 10 నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఉంటుందని తెలిపారు. అంతేకాకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన మీ కోసం కాల్ సెంటర్ 1100కు ఫోన్ చేసి గతంలో ఇచ్చిన ఫిర్యాదులు ఏదశలో ఉన్నాయనే విషయాలను తెలుసుకోవచ్చుని, ఎపి.జివోవి.ఇన్ వెబ్‌సైట్‌లో అర్జీలు నమోదు చేసుకోవచ్చని ఆ ప్రకటనలో సూచించారు.

సంతానలక్ష్మికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

గుర్రంకొండ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): రెడ్డెమ్మకొండలో ఆదివారం అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని పరిమళభరిత పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి అర్చకులు పూజలను చేశారు. సంతానం లేని దంపతులు వివిధ ప్రాంతాల నుంచి వచ్చి అర్చకులిచ్చే ఆకు పసరును తాగి, కోనేరులో మునిగి తడి బట్టలతో అమ్మవారి చెంత ఒరపడ్డారు. సంతానం కలిగిన దంపతులు మొక్కులు తీర్చుకోవడానికి అధిక సంఖ్యలో రావడంతో ఆలయ పరిసరాలు భక్తులతో రద్దీగా మారాయి. భక్తులు కొబ్బరికాయలను సమర్పించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో ఈవో మంజుల, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాయమాటలతో బాలిక కిడ్నాప్

పులివెందుల, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణంలోని శేషారెడ్డి స్కూల్ సమీపంలో నివాసముంటున్న ఓ బాలిక (15)ను మాయమాటలు చెప్పి ఓ వ్యక్తి కిడ్నాప్‌కు పాల్పడిన సంఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాల్లోకెళితే... యర్రగుంట్లకు చెందిన క్షుద్రపూజలు చేసే రఘు అనే వ్యక్తికి పులివెందులకు చెందిన ఓ మహిళతో పరిచయం ఉండేది. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం ఆమె ఇంటికి వచ్చి క్షుద్రపూజలతో రూ.లక్ష నగదును రెండు లక్షలు చేసి చూపిస్తానని నమ్మబలికి కొంత సొమ్మును తీసుకున్నాడు. ఈ క్రమంలోనే ఈమె ఇంటి ఎదురుగా ఉన్న బాలిక ఇంటికి వచ్చాడు. ఈ బాలిక ఆమె తల్లితో కలిసి ఉంటోంది. అదేరోజు బాలిక పుట్టినరోజు కావడంతో మాటామాటా కలిపి హోటల్‌కు తీసుకెళ్లి బిర్యానీ తినిపిస్తానని తల్లికి చెప్పి అక్కడి నుంచి బాలికను తీసుకెళ్లాడు. ఎంతసేపటికి రాకపోవడంతో బాలిక తల్లి అతనికి ఫోన్ చేయగా వర్షం పడుతోందని, కొంతసేపటికి వస్తామని సమాధానమిచ్చాడు. అనంతరం ఆ వ్యక్తి ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకున్నాడు. ఆ రోజు నుంచి బాలిక ఆచూకీ కనిపించకపోవడంతో బాలిక తల్లి పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు బాలిక ఎదురింట్లో ఉంటున్న మహిళ ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సీతారామిరెడ్డి తెలిపారు.

ప్రియురాలు చనిపోయిందని

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య



7

రైలుకింద పడి కుటుంబం ఆత్మహత్య



రైలుకింద పడి మృతిచెందిన వ్యక్తి, చిన్నారి

కడపక్రైం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రైల్వేస్టేషన్ సమీపంలోని యార్డు వద్ద ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్లు కడప రైల్వే పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు.. ఆదివారం రాత్రి రైలుకింద పడి మృతిచెందినట్లు సమాచారం రావడంతో ఘటనా స్థలానికి చేరుకున్నామని, పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించామన్నారు. వీరిలో మగ వ్యక్తికి (25), మహిళకు (22), ఏడాది వయసు ఉన్న పసికందుతో కలిసి ఆత్మహత్యకు పాల్పడ్డారని తెలిపారు. కాగా వీరి మృతికి ఆర్థిక సమస్యలా ? లేక ఇతర కారణాలా అనే విషయంపై కడప రైల్వే పోలీసులు ఆరాతీస్తున్నారు. మృతుల వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తులుగా కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. అలాగే బుగ్గవంక బ్రిడ్జి వద్ద కడప నబీకోటకు చెందిన శివ (33) రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

హంద్రీ-నీవా కాలువలో

విద్యార్థి గల్లంతు

● గాలింపు చర్యలు చేపట్టిన ఫైర్ సిబ్బంది



7

విద్యావ్యవస్థ అస్తవ్యస్తం : తులసిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న తులసిరెడ్డి

బద్వేలు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): వైసీపీ, టీడీపీ కూటమి పార్టీలు రాష్ట్రానికి రాహుకేతువులుగా దాపురించాయని, దొందూ దొందేనని రాజ్యసభ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ అధికార పార్టీ ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి ధ్వజమెత్తారు. ఆదివారం బద్వేలులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్లలో రాష్ట్రాన్ని అప్పులు, అరాచక, మద్యం, గంజాయి, డ్రగ్స్ ఆంధ్రప్రదేశ్‌గా తయారు చేసిందన్నారు. ప్రస్తుతం టీడీపీ కూటమి పాలనలో పరిస్థితి మరింత అధ్వానంగా తయారైందని ఆయన విమర్శించారు. అలాగే రైతుల పరిస్థితి దయనీయంగా తయారైందని, నానాటికి తీసికట్టు, నాగంపట్టం అన్నట్లుగా ఉందని శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ పథకం కింద రూ.64 కోట్లు బకాయిలు ఉన్నాయని, ఇందులో కొంతశాతం మాత్రమే రిలీజ్ చేశారని తెలిపారు. ఇవ్వాల్సింది కొండంత.. ఇచ్చింది గోరంత అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సిబ్బందికి జీతాలు ఇవ్వలేక కళాశాల యాజమాన్యాలు ఇబ్బందులు పడుతున్నాయని, పెండింగ్‌లో ఉన్న బకాయిలను ప్రభుత్వం పూర్తి స్థాయిలో విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పాలనలో వ్యవసాయం పండుగ అనే వాతావరణం ఉండేదని, కానీ నేడు దండగ అనే వాతావరణం ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మార్కెట్, ఇంటర్‌వెన్స్ స్కీం ద్వారా రైతుల పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్యుతరాజు, బద్వేలు పట్టణ అధ్యక్షుడు పగడాల నరసింహ, శ్రీనివాసరాజు, అమర్‌నాథ్‌రెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.

గండికోటకు కృష్ణాజలాలు నిలిపివేత



గండికోట ప్రాజెక్టులో ప్రస్తుత నీటిమట్టం

కొండాపురం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టుకు అవుకు రిజర్వాయర్ నుంచి ఆదివారం కృష్ణాజలాలు నిలిపివేసినట్లు ఈఈ ఉమామాహేశ్వర్లు తెలిపారు. దీంతో జీఎన్ఎస్ఎస్ వరదకాలువ ద్వారా అవుకు నుంచి గండికోటకు వచ్చే నీటిప్రవాహం పూర్తిగా నిలిచిపోయిందన్నారు. ప్రస్తుతం గండికోట నుంచి సీబీఆర్‌కు 500 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల దృష్ట్యా మరో 20 క్యూసెక్కుల నీరు వదులుతున్నామన్నారు. గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 26.85 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటిమట్టం 26.436 టీఎంసీలుగా ఉందని ఈఈ తెలిపారు.

వైవీయూ వీసీగా ప్రొఫెసర్ రాజశేఖర్

● నేడు బాధ్యతల స్వీకరణ



ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ జిల్లాలకు తలమానికంగా నిలిచిన యోగివేమన విశ్వవిద్యాలయానికి వైస్ చాన్సలర్‌గా ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్ నియమితులయ్యారు. కూటమి ప్రభుత్వం రెగ్యులర్ వీసీని నియమించి విశ్వవిద్యాలయానికి ఒక కొత్త అధ్యాయానికి నాంది పలికింది. అనేక రంగాల్లో నైపుణ్యం కలిగిన ఆయన దూరదృష్టి, దృఢ సంకల్పం వైవీయూ విద్యా, పరిశోధన వ్యవస్థలకు కొత్త ఉత్సాహాన్ని నింపనున్నాయని, వర్సిటీని సమర్థవంతంగా నడిపించడంతో పాటు పేరు ప్రఖ్యాతలు తీసుకువస్తారని మేధావి వర్గం అభిప్రాయపడుతున్నారు. కాగా వైవీయూ ఉపకులపతిగా నియమితులైన రాజశేఖర్ సోమవారం ఉదయం 11గంటలకు బాధ్యతలు చేపట్టనున్నారు. ఇప్పటివరకు ఇన్‌చార్జి వీసీగా విధులు నిర్వహించిన ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు నూతన వీసీకి బాధ్యతలు అప్పగించనున్నారు.

విద్యారంగానికి కొత్త దిక్సూచి

సెంట్రల్ యూనివర్సిటీలో పనిచేసిన వారిని వైస్ చాన్సలర్లుగా నియమించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఎంబీఏ విభాగ సీనియర్ ప్రొఫెసర్ రాజశేఖర్‌ను ఎంపిక చేశారు. ఈయన వైవీయూలో సరికొత్త విజనరీ చూపేందుకు సిద్ధమవుతున్నారు.

నిర్వహించిన విధులు

ప్రొఫెసర్ రాజశేఖర్ 1990లో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి బీటెక్ (సివిల్ ఇంజనీరింగ్) పూర్తిచేశారు. 1999లో హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో చేరి స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ (ఎస్ఎంఎస్) అభివృద్ధికి మూలస్తంభంగా నిలిచారు. ఆయన మార్గదర్శకత్వంలో ఈ సంస్థ దేశంలోని అగ్రశ్రేణి మేనేజ్‌మెంట్ విద్యా కేంద్రాల్లో ఒకటిగా ఎదిగింది. అంతేకాకుండా మూడు డాక్టరేట్ పట్టాలనూ పొందారు. మేనేజ్‌మెంట్ (కాకతీయ యూనివర్సిటీ, 2002), సైకాలజీ (శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ, 2014), ఎడ్యుకేషన్ (డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ)లో సాధించారు. అనంతరం బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (ఉస్మానియా యూనివర్సిటీ), సైకాలజీ (శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ), ఎడ్యుకేషన్ (ఇగ్నో), డేటా సైన్స్‌అండ్ ఇంజనీరింగ్ (బిట్స్‌పిలాని, 2025)లలో నాలుగు మాస్టర్స్ డిగ్రీలు సాధించారు. ఆయన విద్యా ప్రస్థానం నిజమైన అకడమిక్ ఎక్సలెన్స్ జర్నీకి అద్భుతమైన ఉదాహరణగా నిలుస్తోంది.

ముందున్న సవాళ్లు

వీసీగా బాధ్యతలు చేపట్టనున్న ప్రొఫెసర్ రాజశేఖర్ ఎదుట అనేక సవాళ్లు ఉన్నాయి. దీర్ఘకాలంగా ఉన్న వైవీయూ హెల్త్ క్లినిక్ నిర్మాణంపై దృష్టి పెట్టాల్సి ఉంటుంది. అలాగే హెల్త్ క్లినిక్‌లో కనీసం జ్వరానికి కూడా మందులు లేవు. యూనివర్సిటీ క్యాంపస్‌లో ఉండే విద్యార్థులు అధికంగా గ్రామీణ ప్రాంతానికి చెందిన పేద మధ్యతరగతికి చెందిన వారు. కనీసం జ్వరం మాత్ర కొనాలన్నా దాదాపు 5 కి.మీ. ప్రయాణం చేయాల్సిన పరిస్థితి. నిధులు పుష్కలంగా ఉన్నప్పటికి డిస్పెన్సరీలో మందులు వివిధ సేవలు లేకపోవడంపై సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. దీనిపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. చాలా విభాగాల్లో ఫ్యాకల్టీ కొరత వేధిస్తోంది. కొన్ని విభాగాల్లో అయితే రెగ్యులర్ ఫ్యాకల్టీ లేకపోవడంతో అకడమిక్ కన్సల్టెంట్‌లదే హవా కొనసాగుతోంది. వాళ్లకి ఎటువంటి బాధ్యతలు లేకపోవడంతో విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

నకిలీ మద్యం వ్యవహారంలో

కాణిపాకంలో ప్రమాణానికి సిద్ధమా?

● జగన్‌కు మంత్రి మండిపల్లి సవాల్



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): 'ములకలచెరువులో బయటపడిన నకిలీ మద్యం వ్యవహారంలో నాకు సంబంధం ఉందని మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాపై విమర్శలు చేస్తున్నారు. అయితే నాకు ఎటువంటి సంబంధం లేదు. ఆ మాట మీదే నేను కాణిపాకంలో ప్రమాణానికి సిద్ధం.. జగన్ నీవు సిద్ధమేనా?' అని రాష్ట్ర యువజన, క్రీడా, రవాణాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సవాల్ విసిరారు. రాయచోటి పట్టణంలోని ఆయన కార్యాలయంలో ఆదివారం ఉదయం మంత్రి మీడియా సమావేశంలో మాట్లాడారు. మాజీ సీఎం హోదాలో ఉన్న జగన్‌మోహన్‌రెడ్డి తమ నాయకుడు చంద్రబాబునాయుడు, నారా లోకేశ్, మంత్రిగా ఉన్న తనపైన విమర్శలు చేశారని, జగన్‌కు చాలెంజ్ విసురుతున్నా.. రండి కాణిపాకం వెళ్లి వినాయకుడి వద్ద ప్రమాణం చేద్దాం.. నకిలీ మద్యంలో తాము భాగస్వామ్యమై వుంటే ఆ దేవుడే మమ్మల్ని చూసుకుంటాడు అన్నారు. మీరు చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకే తమపై ఆరోపణలు చేస్తున్నారు. తమ పార్టీలో ఉన్న నాయకులు చిన్న తప్పు చేసినా తమ నాయకుడు చర్యలు తీసుకుంటారు. ములకలచెరువు ఘటనలో కూడా రాష్ట్ర ఎక్సైజ్ చట్ట పరిధిలో ఎవరు తప్పు చేసినా వారిని శిక్షిస్తాం. ఇందులో భాగంగానే టాస్క్‌ఫోర్స్ పనిచేస్తోంది. ఇందులో తప్పు చేసిన వారందరినీ విచారించి జైలుకు పంపించామన్నారు. మీ ప్రభుత్వంలో దళిత డ్రైవర్‌ను చంపిన ఎమ్మెల్సీని ఈరోజు మీ వెంట పెట్టుకుని తిప్పలేదా, ఆ రోజు అతడిపై ఏమైనా చర్యలు తీసుకున్నారా అని ప్రశ్నించారు. నెల్లూరు జిల్లాలో ఒక మహిళా ఎమ్మెల్యేను ఒక మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే అసభ్యకరంగా మాట్లాడినా ఎటువంటి చర్య లేదని విమర్శించారు. ప్రైవేటీకరణకు, పీపీపీకి తేడా తెలియకుండా మాజీ సీఎం మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. టీడీపీ హయాంలోనే రాష్ట్రంలో అనేక ప్రముఖ మెడికల్ కళాశాలలు వచ్చాయని తెలిపారు.

ప్రియురాలు చనిపోయిందని
సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య



మృతి చెందిన ఫారూక్

రాయచోటి(నేతాజీ సర్కిల్), అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రేమించిన అమ్మాయి చనిపోయిందని ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మనస్థాపానికి గురై ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కన్నకొడుకు మృతదేహాన్ని చూసి ఆ తల్లిదండ్రుల హృదయం తరుక్కుపోయింది. తాము ఎవరి కోసం బతకాలంటూ కన్నీటి పర్యంతమయ్యారు. వారి ఆర్తనాదాలు అందరినీ కంటతడి పెట్టించాయి. ఈ సంఘటన సంబేపల్లె మండలం దేవపట్ల గ్రామం ఆవులవాండ్లపల్లెలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సంబేపల్లె మండలం దేవపట్ల గ్రామం ఆవులవాండ్లపల్లెకు చెందిన బాదుల్లా బాషా, సల్మా దంపతుల కుమారుడు షేక్ ఫారూక్ (22) హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడని తెలిపారు. నాలుగేళ్లుగా హైదరాబాదులో ఉద్యోగం చేస్తూ అక్కడ ఒక యువతి ప్రేమించినట్లు తెలిపారు. ఆమెకు ఏమైందో తెలియదు, కొద్దిరోజుల క్రితం ఆమె మృతి చెందిందని, దీంతో మనస్థాపానికి గురైన ఫారూక్ ఇంటికి వచ్చాడని తెలిపారు. ఆదివారం తల్లీతండ్రి పొలం వద్దకు వెళ్లిన సమయంలో ఇంటిలో ఎవరూ లేకపోవడంతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటికి వచ్చిన తల్లిదండ్రులు కొడుకు మృతి చెందడంతో ఇక తామెవరి కోసం బతకాలంటూ బోరున విలపించారు. విషయం తెలుసుకున్న ఏఎస్ఐ బాదుల్లా సంఘటన స్థలానికి చేరుకొని మృతికి గల కారణాలపై ఆరా తీశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మనస్థాపంతో యువకుడి మృతి



మృతి చెందిన అరుణ్‌కుమార్

దువ్వూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం ఇడమడక సమీపంలో మూతపడిన ఓ దాబాలో అరుణ్‌కుమార్ (19) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం ఉదయం అందిన సమాచారం మేరకు స్థానిక పోలీసులు అక్కడకు వెళ్లి సంఘటనను పరిశీలించారు. మృతుడు ఆళ్లగడ్డ ప్రాంతంలోని యాదవవాడ గ్రామానికి చెందినవాడని ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు. ప్రేమించిన విషయంలో మనస్థాపానికి గురై ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

నిప్పంటించుకుని వ్యక్తి మృతి

సీకేదిన్నె, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుని కొండపల్లె గంగన్న(57) మృతి చెందినట్లు సీకే దిన్నె పోలీసులు తెలిపారు. కడప రాజారెడ్డి వీధికి చెందిన గంగన్న ఆదివారం రాత్రి 7గంటల సమయంలో మండలంలోని మామిళ్లపల్లె పంచాయతీ రామచంద్రయ్యకాలనీకి బైక్‌పై వచ్చి రెండు లీటర్ల పెట్రోల్ తెచ్చుకుని ఒంటిపై పోసుకుని నిప్పంటించుకున్నారని తెలిపారు. మంటల తాకిడి తట్టుకోలేక కేకలు వేయడంతో స్థానికులు గమనించి సీకే దిన్నె పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకునేలోపల గంగన్న మృతి చెందినట్లు గుర్తించారు. మృతికి గల కారణాలు తెలియరాలేదని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

జమ్మలమడుగు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలోని భాగ్యనగర్ కాలనీలో షేక్ పెద్ద హసన్‌సాహెబ్ (45) అనే వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఇంట్లో ఎవరికీ చెప్పకుండానే ఇంటి నుంచి వెళ్లిపోయాడని ఆదివారం ఉదయం అర్బన్ పోలీసుస్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అదృశ్యమైన వ్యక్తి కోసం విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

అదుపు తప్పి చెట్టును ఢీకొన్న వాహనం



దెబ్బతిన్న కారు ముందుభాగం

వేముల, అక్టోబరు 12(ఆంధ్ర జ్యోతి): మండలంలోని గొందిప ల్లె సమీపంలో కడప-పులివెందుల ప్రధాన రహదారిలో ఓ కారు అదుపు తప్పి రోడ్డు పక్కనున్న చెట్టును ఢీకొట్టింది. ఆదివారం సాయంత్రం జరిగిన ఈ ప్రమాదంలో కారులో ఉన్న పులివెందుల వైసీపీ నాయకుడు హాల్ గంగాధర్‌రెడ్డి, ఆయన సోదరుడు గాయపడ్డారు. చెట్టుకు ఢీకొట్టడంతో కారు ముందుభాగం దెబ్బతినింది. ఆ సమయంలో వేంపల్లె నుంచి పులివెందులకు వెళ్తున్న డీఎస్పీ మురళీనాయక్ గాయపడిన వారిని పులివెందులలోని ఓ ప్రైవేట ఆసుపత్రికి తన వాహనంలో తరలించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

కొండాపురం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టి.కోడూరు గ్రామం సమీపంలోని పెన్నానది వద్ద ఆదివారం పోలీసులు ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. అనంతపురం జిల్లా వీరాపురానికి చెందిన ట్రాక్టర్ అనుమతి లేకుండా నదిలో ఇసుకను తరలిస్తుండగా ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్సై శివనాగిరెడ్డి తెలిపారు. ట్రాక్టర్‌ను రెవెన్యూ అధికారులకు అప్పగించనున్నట్లు తెలిపారు.

బస్‌షెల్టర్, సర్వీసు రోడ్డు నిర్మాణం జరిగేనా..?

- ఆరేళ్లుగా అడుగుతున్నా నిర్లక్ష్యమే
- నిబంధనలు పాటించని హైవే అధికారులు
- ఆందోళనకు సిద్ధమవుతున్న ప్రజలు



సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయకపోవడంతో రోడ్డు అంచున ఏర్పాటు చేసిన చిరువ్యాపార బండ్లు



చెన్నూరులో బస్‌షెల్టరు నిర్మించకపోవడంతో ఖాళీగా ఉన్న స్థలం ఇదే..

చెన్నూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): హైవేలో ఎలాంటి అభివృద్ధి పనులు మిగలకుండా పూర్తి చేయాలని నిబంధనలున్నా ఇప్పటి వరకు నిర్లక్ష్యమే తప్ప పనులు పూర్తిచేసే దిశగా ఒక్క అడుగు కూడా పడలేదు. ప్రజాప్రతినిధులు ప్రతి సమావేశంలో అభివృద్ధి పనులు పూర్తి చేయాలని, ప్రజలకు మంచి సౌకర్యాలు కల్పించాలని పదేపదే చెబుతున్నా వారి మాటలకు విలువ లేకుండాపోతోంది. మండల కేంద్రంలో కానీ, హైవే దారిలో గ్రామాలు ఉన్నచోట సర్వీసురోడ్లు, బస్‌షెల్టరు ఏర్పాటు చేయాలనే నిబంధనను హైవే అధికారులు పూర్తిగా తుంగలో తొక్కేశారు. దీంతో మండల కేంద్రమైన చెన్నూరు కొత్త రోడ్డులో సర్వీసు రోడ్డు, బస్‌షెల్టరు నిర్మాణం జరగక ప్రజలు పడే ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. చిన్న మాచుపల్లె వద్ద తప్ప మండలంలో ఇంకెక్కడా సర్వీసు రోడ్లు చేపట్టలేదు. హైవే అధికారులు స్థలం చూపించినా దాతలు కట్టిస్తామని చెబుతున్నా పట్టించుకునే నాథుడే లేడని ప్రయాణికులు వాపోతున్నారు. ఫలితంగా బస్సుల కోసం ఎదురుచూసే సమయంలో ముఖ్యంగా వేసవికాలం, వర్షాకాలంలో ప్రయాణికులు పడే ఇబ్బందులు వర్ణనాతీతం. ఈ హైవే రోడ్డుపై కొత్త రోడ్డు ప్రాంతం మీదుగా నిత్యం వేలాది మంది ద్విచక్ర వాహనాలు, కార్లు, బస్సులలో రాకపోకలు సాగిస్తుంటారు. ఇలాంటి చోట సర్వీసు రోడ్డు ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నిస్తున్నారు. కేవలం 400 మీటర్ల మేర ఇరువైపులా సర్వీసు రోడ్డు ఏర్పాటు చేసి ఉంటే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉండేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సర్వీసు రోడ్లు, బస్సు షెల్టర్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఆరేళ్లుగా ఇదే తంతు

2009లో హైవే కోసం తీసుకున్న స్థలంలో 2012 నాటికి రోడ్డు పూర్తయింది. ఆ తరువాత చాలా ఏళ్లకు సర్వీసు రోడ్లు, బస్‌షెల్టరు కావాలని ప్రజలు అడిగినప్పుడల్లా హైవే అధికారులు ఏదో ఒక సాకు చెప్పి తప్పించుకుంటున్నారు. దీంతో పలుమార్లు రోడ్డుపై ఆందోళన చేపట్టారు. ఇలా చేసినప్పుడల్లా హైవే మేనేజరు రావడం.. ఏవో మాయమాటలు చెప్పి తప్పించుకోవడం ఒక తంతుగా జరుగుతోంది.

ఎమ్మెల్యే చెప్పినా నిర్లక్ష్యమే..

సర్వీసు రోడ్లు, బస్‌షెల్టరు నిర్మించాలని చెన్నూరులో జరిగిన ప్రతి మండల సమావేశంలో ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి హైవే అధికారులను ఆదేశించారు. పైగా పలుమార్లు తీవ్ర స్వరంతో కూడా చెప్పడం జరిగింది. అయినా ఎమ్మెల్యే మాటలను కూడా నిర్లక్ష్యంగా కొట్టిపడేస్తున్నారు. మరి ఈ సర్వీసు రోడ్లు ఎప్పుడు వేస్తారో, బస్ షెల్టరు ఎప్పుడు కడతారో తెలియని పరిస్థితి.

ఆందోళనకు సిద్ధమవుతున్న ప్రజలు

హైవే రహదారిలో ఇప్పటి వరకు సర్వీసు రోడ్లు కానీ, బస్‌షెల్టరు కానీ చేపట్టకపోవడంతో ప్రజలు ఆందోళనకు సిద్ధమయ్యారు. స్థలం ఉన్నా నిర్మాణం చేపట్టడంలో హైవే అధికారుల నిర్లక్ష్యమే ప్రధానంగా కనిపిస్తోంది. దీంతో పలుమార్లు జిల్లా అధికారులు వచ్చి మందలించినా వారి మాటలు బేఖాతరు చేస్తున్నారు. దీంతో ఆగ్రహించిన ప్రజలు అభివృద్ధి పనుల కోసం త్వరలో ఆందోళన బాటపట్టేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.



ఎండలోనే బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

వీవోఏల పోరాటాల ఫలితంగానే కాలపరిమితి సర్క్యులర్ రద్దు

- వీవోఏల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి



సభలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి

రాయచోటిటౌన్, అక్టోబరు12(ఆంధ్రజ్యోతి): సీఐటీయూ ఆధ్వర్యంలో డీఆర్‌డీఏలోని వెలుగు పథకంలో పనిచేస్తున్న వీవోఏలు చేసిన నిరవధిక పోరాటాల ఫలితంగానే ప్రభుత్వం కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేసిందని వీవోఏల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి అన్నారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో వెలుగు యానిమేటర్ల జిల్లా మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ధనలక్ష్మి మాట్లాడుతూ వీవోఏల అభివృద్ధికి ప్రభుత్వం నాణ్యమైన సెల్‌ఫోన్లు ఇస్తామనడం హర్షించదగ్గ విషయమన్నారు. అలాగే హెచ్‌ఆర్ పాలసీ అమలు చేసి కనీస వేతనం ఇవ్వాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ రూ.10 లక్షలు చేస్తే ప్రమాద బీమా కలుగుతుందని, చనిపోయిన వారికి మట్టి ఖర్చులు ఇవ్వడంతో పాటు సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. అనంతరం వీవోఏల సంఘం రాష్ట్ర కోశాధికారి తిరుపతయ్య మాట్లాడుతూ ఈనెల 27, 28వ తేదీల్లో జరిగే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నంద్యాల వీవోఏల సంఘం జిల్లా అధ్యక్షుడు సోమన్న, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్బవరం రామాంజులు, భాగ్యలక్ష్మి, వీవోఏల సంఘం నాయకులు రెడ్డెప్పరెడ్డి, కృష్ణమ్మ, సుబ్రమణ్యం, పరంజ్యోతి, ఉత్తప్ప, పవన్, ఆనంద్, నిర్మల, రెడ్డెప్ప, వారద, నాగసులోచన, శివశంకర్‌రెడ్డి, రమణారెడ్డి, శంకరమ్మ, నరసమ్మ, సుగుణమ్మ, రమణకుమారి, గురవయ్య, యానిమేటర్లు పాల్గొన్నారు.

హంద్రీ-నీవా కాలువలో విద్యార్థి గల్లంతు

- గాలింపు చర్యలు చేపట్టిన ఫైర్ సిబ్బంది



సాయికిరణ్ (ఫైల్)

మదనపల్లె, అర్బన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): హంద్రీ-నీవా కాలువలో పడి పదవ తరగతి విద్యార్థి ఆదివారం సాయంత్రం గల్లంతైన సంఘటన మదనపల్లెలో జరిగింది. విషయం తెలుసుకున్న వెంటనే మదనపల్లె ఫైర్ సిబ్బంది కాలువలో గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేదు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మదనపల్లె పట్టణం రామారావు కాలనీకి చెందిన సురేశ్, సరళ దంపతులు టమోటా మార్కెట్‌లో దినసరి కూలీలుగా పనిచేస్తారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. అందులో పెద్ద కుమారుడు సాయికిరణ్ (16) స్థానిక అభ్యుదయ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఆదివారం మధ్యాహ్నం తన మిత్రులైన భానుతేజా, శేషబాబు, సాత్విక్‌రెడ్డిలతో కలిసి బైక్‌పై వెళ్లి వడ్డిపల్లె సమీపంలో హంద్రీ-నీవా కాలువలో ఈత ఆడటానికి దిగి గల్లంతయ్యాడు. మిత్రులు ఈ విషయాన్ని కుటుంబసభ్యులకు తెలపడంతో వారు అక్కడికి చేరుకుని రోదించారు. ఫైర్ సిబ్బంది ఎంత గాలించినా ఆచూకీ దొరకలేదు. చీకటి పడటంతో సోమవారం ఉదయం తిరిగి గాలింపు చేపడతామని తెలిపారు.



కాలువ గట్టుపై రోదిస్తున్న మృతుడి తల్లి, బంధువులు

క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్

- స్కేటింగ్ అధికారి ఇజ్రాయిల్



జిల్లా స్థాయి స్కేటింగ్‌లో ప్రతిభ కనబరచిన విద్యార్థులు

రాజంపేట, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించినప్పుడే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని స్కేటింగ్ అధికారి ఇజ్రాయిల్ అన్నారు. ఆదివారం కడప నగరంలో జిల్లాస్థాయి స్కేటింగ్ పోటీ నిర్వహించారు. ఈ పోటీల్లో రాజంపేట పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల చిన్నారులు పాల్గొని అత్యు త్తమ ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో భువనే శ్వర్ గోల్డ్‌మెడల్ సాధించగా భవ్య, తేజ, సాయి, మను, మనస్విత రజత పతకాలు, జమాల్‌పల్లి కాంస్య పతకం సాధించినట్లు స్కేటింగ్ మాస్టర్ వినోద్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సభ్యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బెల్ట్‌షాపుపై దాడి

- వ్యక్తి అరెస్టు.. మద్యం బాటిళ్లు స్వాధీనం

ములకలచెరువు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని గూడుపల్లె పంచాయతీ కనుగొండవారిపల్లెలో ఆదివారం బెల్ట్‌షాపుపై దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ నరసింహుడు తెలిపారు. గ్రామంలో మద్యం విక్రయిస్తున్న జయరాం (54)ను అరెస్టు చేసి అతని వద్ద నుంచి 38 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఎక్కడైనా బెల్ట్‌షాపులు నిర్వహిస్తే తమ దృష్టికి తీసుకు రావాలని ఎస్ఐ సూచించారు.


స్నేహితుడికి చేయూత

- ఇబ్బందులు తెలుసుకుని ఆర్థికసాయం అందించిన మిత్రులు

సీకేదిన్నె, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఎవరికివారే ఎమునా తీరే చందంగా వ్యవహరిస్తున్న ప్రస్తుత సమాజంలో తమ తోటి స్నేహితుడు ఇబ్బందుల్లో ఉన్నాడని తెలిసి మిత్రులంతా కలిసి ఆర్థికసాయం అందించారు. 30 సంవత్సరాల క్రితం కలిసి చదువుకున్న స్నేహితులంతా కలిసి రూ.50వేలను మిత్రుడికి అందించారు. చింతకొమ్మదిన్నె మండలం బయనపల్లి శ్రీవెంకటేశ్వర పాఠశాలలో 1994-95సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులలో బయనపల్లెకు చెందిన తిరుమలశెట్టి రమేశ్ కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఇటీవల షుగర్ వ్యాధితో బాధపడుతూ ఎక్కువ కావడంతో కాలు కొంత భాగం తొలగించారు. ఈ విషయం తెలుసుకున్న పడిగెలపల్లె గ్రామానికి చెందిన అరిగెల రామచంద్ర మిగతా స్నేహితులకు సమాచారం అందించి తమవంతుగా ఎంతో కొంత సాయం చేద్దామని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు అందరూ కలిసి రూ.50 వేలు పోగు చేశారు. ఆదివారం రమేశ్ ఇంటికి వచ్చి ఈ ఆర్థికసాయం అందించారు. దీంతో రమేశ్ కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. తోటి అన్నదమ్ములే పట్టించుకోని ఈ రోజుల్లో స్నేహితులు అందించిన సాయం అభినందనీయమని పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో 1994-95 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు మిత్రులు పాల్గొన్నారు.




రమేశ్‌కు ఆర్థికసాయం అందిస్తున్న మిత్ర బృందం



కుందూలో తగ్గిన నీటిమట్టం

- రైతుల్లో ఆందోళన
- కేసీ కాలువను కప్పుతున్న కంపచెట్లు



కామనూరు వద్ద కుందూలో తగ్గిన నీటిమట్టం

దువ్వూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): కుందూ నదికి, కేసీ కాలువకు అవినాభావ సంబంధం ఉంది. శ్రీశైలం రిజర్వాయర్ ద్వారా కృష్ణా జలాలు కుందూనదిలో పడి రాజోలి ఆనకట్ట వద్ద కేసీ కాలువలోకి ప్రవహిస్తాయి. ఈ నేపథ్యంలో కుందూ ప్రవాహంపై కేసీ నీటిమట్టం ఆధారపడి ఉంది. అయితే కుందూలో ప్రస్తుతం అయిదు వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. పెద్ద వర్షాలు పడిన సమయంలో 35 వేల క్యూసెక్కుల నీరు కూడా కుందూలో ప్రవహిస్తుంది. రాజోలి వద్ద నుంచి ఇడమడక, కానగూడూరు, జిల్లేళ్ల, ఏకోపల్లి, దువ్వూరు, భీమునిపాడు అటు నుంచి మైదుకూరు, ఖాజీపేట నుంచి పెన్నాలో నీరు కలుస్తుంది. ఈ పరిధిలో సుమారు 56 కి.మీ. దూరం కేసీ నీరు ప్రవహిస్తుంది. తద్వారా వేలాది ఎకరాలకు సాగునీరు అందుతుంది. కుందూలో నీటిమట్టం తగ్గినా రైతులు ఏ మాత్రం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికారులు పేర్కొంటున్నారు.

కాలువను కప్పుతున్న కంపచెట్లు

ఈ పరిస్థితుల్లో కేసీ కాలువకు ఇరువైపులా కట్టల మీద కంపచెట్లు విపరీతంగా ఉన్నాయి. ఈ చెట్లు కట్టలను కప్పేస్తుండడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. చాలా గ్రామాల పరిధిలో రైతులు తమ పొలాల వద్దకు కట్టలమీద నడిచి వెళుతుంటారు. మరికొన్ని చోట్ల రైతులు సత్తువలు, దిగుబడులు, ఇతరత్రా వాటిని కట్టను ఆధారం చేసుకుని పొలాలకు తీసుకెళుతుంటారు. దీంతో కేసీ అధికారులు కంపచెట్ల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.




రాంసాయినగర్ వద్ద కేసీ కాలువ కట్టను కప్పేస్తున్న కంపచెట్లు

మఠాధిపతి నియామకం కోసం సమావేశం

బ్రహ్మంగారిమఠం, అక్టోబర్ 12(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం బ్రహ్మం గారిమఠం మఠాధిపతి నియామకం కోసం ఈనెల 28వ తేదీన ఉదయం 11 గంటలకు పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థాన ప్రాంగణంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు దేవదాయ ధర్మదాయశాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనరు చంద్రశేఖర్ ఆజాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ ధార్మిక పరిషత్ నియమించిన అధికారి నేతృత్వంలో ఈ ఎన్నిక జరుగుతుందని, మఠా ధిపతి నియామకం కోసం మఠం శిష్యులు, ఆశావహులు హాజరై వారి సందేహాలు, సూచనలు ఆధారాలతో సహా లిఖితంగా క్లుప్తంగా తెలపాలని కోరారు. అనుకోని పరిస్థితుల్లో రాలేకపోయిన వారు కూడా తమ అభిప్రాయాలను పోస్టు ద్వారా పంపవచ్చని ఆ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.

రాష్ట్ర స్థాయి బాలికల క్రికెట్ పోటీలకు
ఆదర్శ పాఠశాల విద్యార్థిని



సంధ్య

పుల్లంపేట, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ అండర్-19 రాష్ట్రస్థాయి బాలికల క్రికెట్ జట్టుకు పుల్లం పేట ఆదర్శ పాఠశాల సెకండియర్ బైపీసీ విద్యా ర్థిని సంధ్య ఎంపికైంది. ఆదివారం రైల్వేకోడూరులోని ఎస్వీ జూనియర్ కళాశాలలో నిర్వహించిన సెలక్షన్స్‌లో సంధ్య ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ లీలాశ్రీహరి, పీడీ నీలకంఠరావు తెలిపారు. ఈ సందర్భంగా సంధ్యను ఉపాధ్యాయ బృందం అభినందించారు.

ఆరోగ్యశ్రీపై నిర్లక్ష్యం విడనాడాలి

ఏఐటీయూసీ

కడపసెవెన్ రోడ్స్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రులకు నిధులు విడుదల చేయలేదని ఆరోగ్యశ్రీ సేవలు నిలుపుదల, గ్రామీణ ప్రాంతాల్లో పీహెచ్‌సీ డాక్టర్ల సమ్మెతో పేద,మధ్య తరగతి ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జి.వేణుగోపాల్ అన్నారు. కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం విడనాడాలని హితవుపలికారు. ఆదివారం స్థానిక హోచిమిన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ బకాయిలు పేరుకుపోవడం పలుదఫాలుగా కూటమి ప్రభుత్వానికి ప్రైవేట్ నెట్‌వర్క్ హాస్పిటల్స్ విజ్ఞప్తి చేసినా పట్టించుకోకపోవడం బాధాకరంగా ఉందన్నారు. ఈ సమావేశంలో జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా, నగర అధ్యక్షుడు పి.సుబ్బరాయుడు, ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి మరియమ్మ పాల్గొన్నారు.

ఏసుమార్గంలోనే శాంతి

కడప కల్చరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఏసుమార్గంలోనే శాంతి దొరుకుతుందని దైవ సేవకుడు పాస్టర్ మహేశ్ అన్నారు. ప్రపంచ సేవకుల దినోత్సవ సందర్భంగా ఆదివారం స్థానిక 48వ డివిజను కృపాకాలనీలో ఉన్న మందిరంలో ప్రత్యేక ప్రార్థనా కూటమి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతికి చెందిన క్రీస్తు సంఘ దైవజనులు కేకే సుధీర్, సిస్టర్ సత్యవతి చేస్తున్న సేవలను అభినందిస్తూ వారిని సత్కరించారు.సేవకులుసుభాష్, రవితేజ, కిరణ్ పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగులు సమ్మెకు సిద్ధం కండి

కడప నాగరాజుపేట, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు ఎనర్జీ అసిస్టెంట్లు, ఉద్యోగులు సమ్మెకు సిద్ధం కావాలని స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర చైర్మన్ పి.సుదర్శన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుబ్బిరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక యూటీఎఫ్ భవన్‌లో జరిగిన జిల్లా కమిటీ స్ట్రగుల్ కమిటీ సమావేశం నిర్వహించారు. అనంతరం కరపత్రాలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాయబ్, కిరణ్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నాగసుబ్బయ్య, శ్రీహరి పాల్గొన్నారు.

రీసెర్చ్ గెరిల్లాగా ప్రసిద్ధిగాంచిన 'బండి'

కడప కల్చరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): రచయితగా, పరిశోధకుడిగా సంపాదకునిగా, విమర్శకుడిగా జర్నలిస్టుగా, పుస్తక ప్రేమికునిగా బండి గోపాల్‌రెడ్డి బంగోరే అనే పేరుతో తెలుగు పరిశోధన రంగంలో రీసెర్చ్ గెరిల్లాగా ప్రసిద్ధులయ్యారని జిల్లారచయితల సంఘం అధ్యక్షుడు మూలమల్లికార్జునరెడ్డి అన్నారు. బండి గోపాల్‌రెడ్డి జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక కడప రెడ్డి సేవా సమితి కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కడప రెడ్డిసేవా సమితి ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి, కోశాధికారి ఆదినారాయణరెడ్డి, సుబ్బిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ఆ సమితి హాస్టలు విద్యార్థులు పాల్గొన్నారు.

తెలుగునాడు స్టూడెంట్ అధ్యక్షుడిగా యాసిన్

వేంపల్లె, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ అనుబంధ సంస్థ తెలుగునాడు స్టూడెంట్ ఫెడరేషన్ వేంపల్లె అధ్యక్షుడుగా ఇమామ్‌నగర్‌కు చెందిన షేక్ యాసిన్ నియామకమయ్యారు. వేంపల్లె మండలంలో టీడీపీ బలోపేతానికి కృషిచేస్తానని ఆయన తెలిపారు. యువత టీడీపీ వైపు చూస్తోందన్నారు.

రేపటి ఆశాల ధర్నాను జయప్రదం చేయండి

కడప మారుతీనగర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆశాల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 14న కడప ఆర్డీవో కార్యాలయం ఎదుట చేపడుతున్న ఆశా కార్యకర్తల ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గుంటి వేణుగోపాల్ ఆశాలకు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులు మరిచారా..?

జంతు వధశాల వద్ద శిథిలావస్థలో కల్వర్ట్



బళ్లారి రోడ్డులోని జంతు వధశాల వద్ద రోడ్డు దుస్థితి



కడప కలెక్టరేట్,అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): నగరంలో బళ్లారి రోడ్డు లోని జంతు వధశాల వద్ద ప్రధానరోడ్డులోని కల్వర్టు ప్రమాదకరస్థితిలో గుంతలు మిట్టలుగా మారింది. భారీ వాహనాలు వస్తే కూలేందుకు సిద్ధంగా ఉండడంతో ఆరోడ్డులో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. ఆదమరిచి వాహనం నడిపితే ఈ కల్వర్ట్ గుంతల్లో పడాల్సిందే.ఇప్పటికే చాలా మంది ద్విచక్ర వాహనదారులు ఈగుంతల కారణంగా కింద పడి ఆసుపత్రి పాలు అయ్యారని స్థానికులు చెబుతున్నారు. ఇక పోతే ఈ రోడ్డు మార్గానే ప్రఖ్యాత అమీన్ పీర్ దర్గాకు వెళ్లాలంటే నగర ప్రజలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు నిత్యం అసౌకర్యంగా మారింది. ముఖ్యంగా రవాణా సంస్థలకు సంబంధించిన కార్యాలయాలు అధిక సంఖ్యలో ఉండడంతో నిత్యం అత్యధిక లోడుతో వాహనాలు వస్తుంటాయి. ఏ సమయంలో కల్వర్ట్ కుంగే అవకాశం ఉండడంతో వాహనాలను భయం,భయం గా తీసేకెళ్లాల్సిన పరిస్థితి ఉంది. ఈనెల చివరి వారం నుంచి వచ్చే నెల మొదటి వారం వరకు దాదాపు 15 రోజుల పాటు దర్గా ఉత్సవాలు జరగనున్నాయి. అధికారులు, ప్రజా ప్రతినిధులతో పాటు లక్షలాది జనాలు పెద్ద దర్గాను సందర్శించడం జరుగుతుంది. అధికారులు మేకల దొడ్డి వద్ద రోడ్డులోని కల్వర్ట్‌కు మరమ్మతులు చేయాలని పలువురు కోరుతున్నారు.

హామీల సాధన కోసం పోరు

కడప మారుతీనగర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన నేపథ్యంలో నవ్యాంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీల సాధన కోసం అలుపెరగని పోరు సాగిస్తామని జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున హెచ్చరించారు. ఆదివారం స్థానిక ప్రకాశ్‌నగర్‌లోని జేసీఐపీ కార్యాలయంలో పులివెందుల నియోజకవర్గ పార్టీ ముఖ్య నేతల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పులివెందుల అసెంబ్లీ అధ్యక్షుడు రామచంద్ర, వేముల మండల అధ్యక్షుడు రామక్రిష్ణ, లింగాల మండల అధ్యక్షుడు భక్తాంజనేయులు పాల్గొన్నారు.

ఎంఎఫ్ మొండి వైఖరి విడనాడాలి

ఆర్టీసీ కార్మిక పరిషత్ నాయకులు



గేట్‌మీటింగ్‌లో మాట్లాడుతున్న నాయకులు

కడప మారుతీనగర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కడప ఆర్టీసీ గ్యారేజీలో విధులు నిర్వహిస్తున్న మెకానిక్స్ శ్రామిక్స్ తదితర ఉద్యోగుల పట్ల గ్యారేజీ ఎంఎఫ్ మొండి విడనాడాలని కార్మిక పరిషత్ జోనల్ నాయకుడు ఎం.పురుషోత్తం సూచించారు. ఆదివారం గ్యారేజీ ముందు కార్మిక పరిషత్ ఆధ్వర్యంలో గేట్‌మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిపో అధ్యక్ష కార్యదర్శులు కిశోర్‌బాబు, రాజేంద్రరెడ్డి, గ్యారేజీ అధ్యక్ష, కార్యదర్శులు లూర్దురాజ్, ఖాజాపీర్ తదితరులు పాల్గొన్నారు.

'రాజాసింగ్ సభ్యత్వాన్ని రద్దు చేయండి'

కడప మారుతీనగర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి):ఇస్లాం ప్రవక్త హజరత్ మహ్మద్ ముస్తఫాసొలుల్లాహు అలైహివాలీ షసల్లం ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా వ్యాఖ్యలు చేసిన తెలంగాణ రాష్ట్ర శాసనసభ సభ్యుడు రాజాసింగ్ శాసన సభ్యత్వాన్ని తక్షణమే రద్దు చేయాలని కాంగ్రెస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పఠాన్‌మహ్మద్ ఆలీఖాన్, జిల్లా కాంగ్రెస్ కమిటీ మైనార్టీ అధ్యక్షుడు రహ్మతుల్లాఖాన్, మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ కమాల్‌బాషా డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాజాసింగ్‌పై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

పనిచేసే కార్యకర్తకు టీడీపీలో న్యాయం



నూతన కార్యవర్గ ప్రతినిధులను సత్కరిస్తున్న నాయకులు

వేంపల్లె, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): టీడీపీలో కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు న్యాయం జరుగుతుందని టీడీపీ మండల కన్వీనర్ రామమునిరెడ్డి తెలిపారు. వేంపల్లె పార్టీ కార్యాలయంలో నూతనంగా ఎంపికైన మండల కన్వీనర్ రామమునిరెడ్డి, వేంపల్లె పట్టణ అధ్యక్షుడు నామా వేమ కుమార్, మైనార్టీ మండల కన్వీనర్ తెలంగాణ వలి, మండల కార్యదర్శి తక్కెళ్ల షరీఫ్‌ను స్థానిక టీడీపీ నాయకులు, మైనార్టీ నాయకులు శాలువ,పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ జిల్లా నాయకులు పూల అల్లాబక్షు, మహబూబ్ బాష, మహమ్మద్, శివయ్య, మడక శ్రీనివాసులు, డక్కా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతి హామీ అమలు చేయాలి

కడప నాగరాజుపేట, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీలో భాగంగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన నిరుద్యోగ భృతిని వెంటనే అమలు చేయాలని సీపీఐ నగర కార్యదర్శి ఎన్.వెంకటశివ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక హోచిమిన్ భవన్‌లో అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) నగర ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్ష, కార్యదర్శులు ప్రదీప్, శివనాగేంద్ర, నాగార్జున, నరేష్, తిమ్మప్ప, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఉద్యమ పితామహుడి సేవలు చిరస్మరణీయం



నివాళులు అర్పిస్తున్న దృశ్యం

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 12 ఆంధ్రజ్యోతి):ఉపాధ్యాయ ఉద్య మ నాయకుడు పసుపు లేటి భుజంగరావు సేవ లు చిరస్మరణీయమని ఆర్జేయూపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గునిశెట్టి శ్రీనివాసులు అన్నారు. ఆదివారం టీచర్స్ భవన్‌లో భుజంగరావు 17వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టీచర్స్ భవన్ అధ్యక్షుడు బి.రాజగోపాల్, ప్రధానకార్యదర్శి వెంకటసుబ్బయ్య, భుజంగరావు కుమార్తె అనసూయమ్మ, కుటుంబ సభ్యులు డాక్టర్ శ్రావణి, డాక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొని సేవలను స్మరించారు.

వ్యక్తిపై దాడి : కేసు నమోదు

పులివెందుల, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణంలోని జీఎం కాలనీ వద్ద మహబూబ్‌బాషా అనే వ్యక్తిపై కొందరు దాడి చేసినట్లు సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. ఆదివారం ట్రాన్స్‌పోర్టు విషయమై మహబూబ్‌బాషకు మరికొందరికి మాటామాటా పెరిగి ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘర్షణలో నజీర్, యూసఫ్, మరికొందరు కలిసి మహబూబ్ బాషాపై దాడి చేశారు. ఈ దాడిలో మహబూబ్‌బాషాకు స్వల్పగాయాలయ్యాయి. కేసువిచారిస్తున్నామని సీఐ తెలిపారు.

15 మద్యం బాటిళ్లు సీజ్ : ఒకరి అరెస్టు

పులివెందుల, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లపురెడ్డిపల్లె గ్రామానికి చెందిన క్రిష్ణయ్య అనే వ్యక్తి వద్ద నుంచి 15 మద్యం బాటిళ్లు సీజ్ చేసి అతన్ని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. పులివెందుల నుంచి ఆదివారం మద్యం బాటిళ్లు తీసుకొని వెళ్తుండగా తమకు వచ్చిన సమాచారం మేరకు మార్గమధ్యంలో అతన్ని అదుపులోకి తీసుకొని మద్యం బాటిళ్లు సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బంజారా సేవా సమితి రాష్ట్ర ఈసీ సభ్యుడుగా రమేశ్‌నాయక్



ప్రమాణస్వీకారం చేస్తున్న బుక్కే రమేశ్‌నాయక్

వేంపల్లె, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): బంజారా సేవా సమితి రాష్ట్ర ఈసీ సభ్యుడుగా వేంపల్లె మండలం బక్కన్నగారిపల్లెకు చెందిన బుక్కే రమేశ్ నాయక్‌ను నియ మించారు. విజయవాడలోని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఆలిండియా బంజారా సేవా సమితి సమావేశంలో ఈసీ సభ్యుడిగా ప్రమాణస్వీకారం చేశారు. బంజారాల అభ్యున్నతికి తమవంతు కృషిచేస్తానని, ఈసీ సభ్యుడిగా నియామకమైన రమేశ్‌నాయక్ తెలిపారు. ఈ పదవి వచ్చేందుకు సహకరించిన రిటైర్డ్ డీఐజీ డీటీ నాయక్, ఐఏఎస్ చిన్నరాముడు, సంఘ అధ్యక్షుడు చక్రినాయక్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీకాళహస్తి బోర్డుసభ్యురాలిని అభినందించిన ఎమ్మెల్యే మాధవి



హేమావతిని అభినందిస్తున్న ఎమ్మెల్యే మాధవి, శ్రీనివాసరెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు12 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి దేవస్థానం బోర్డు సభ్యురాలిగా పెనగలూరు హేమావతి ఎన్నికైన సందర్భంగా టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే మాధవిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నేతలు హేమావతిని శాలువతో సన్మానించి, అభినందనలు తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ..: కడప నియోజకవర్గంలో అనారోగ్యంతో బాధపడుతున్న లబ్దిదారులకు రూ.8.48లక్షల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆదివారం ప్రభుత్వ విప్.ఎమ్మెల్యే మాధవి పంపిణీ చేశారు.

సనాతన ధర్మం, భగవద్గీత ప్రచారం



సింహాద్రిపురం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు ఇస్కాన్ వారి ఎద్దుల రథంతో సనాతన ధర్మం, భగవద్గీత, భాగవతం గురించి వివరిస్తూ సింహాద్రిపురం వీధులలో ఆదివారం సాయంత్రం నగర సంకీర్తన చేశారు. ఇస్కాన్ వారి రథానికి సింహాద్రిపురం రాగానే మహిళలు ఘనస్వాగతం పలికారు. దాత బాలకృష్ణారెడ్డి తీర్థప్రసాదాలు ఏర్పాటు చేశారు.కార్యక్రమంలోఇస్కాన్ ప్రవక్తలు, భాగవతులు, భక్తులు పాల్గొన్నారు.

పింఛన్‌ను హక్కుగా ప్రభుత్వాలు గుర్తించాలి

కడప సెవెన్‌రోడ్స్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పింఛన్లలో సంస్కరణలకు స్వస్తి చెప్పాలని, వ్యాలిడేషన్ ఆఫ్ పింఛన్ రూల్ రద్దుచేయాలని పింఛనర్స్ అసోసియేషన్ అఖిల భారత నాయకులు ఎం.జనార్దన్‌రెడ్డి అన్నారు. ఆల్ పింఛనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పింఛన్‌దారులు ఎదుర్కొంటున్న సమస్యలపై సదస్సు యూటీఎఫ్ భవన్‌లో ఆదివారం జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా పింఛనర్స్ అసోసియేషన్ అఖిలభారత కో-ఆర్డినేషన్ కమిటీ నాయకులు ఎం.జనార్దన్‌రెడ్డి హాజరై మాట్లాడారు. దేశ అత్యున్నత న్యాయస్థానం పింఛన్ భిక్ష కాదు, ఒక హక్కు అని గతంలో తేల్చిచెప్పిందన్నారు. ఈ సదస్సులో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు,రాష్ట్ర కార్యదర్శి చంద్రమౌళి, జిల్లా ఎన్జీఓ మాజీనాయకులు రామ్మూర్తి నాయుడు, పింఛనర్లు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ప్రజల భద్రతకు విజిబుల్ పోలీసింగ్



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న రిమ్స్ ఎస్ఐ సుభాష్ చంద్రబోస్

కడప క్రైం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా పోలీసులు, ప్రజలకు మరింత చేరువ అవుతూ నేరాలను నియంత్రించడం, రహదారి భద్రతపై అవగాహన కల్పించడం వంటి చర్యలు చేపడుతున్నారు. విజిబుల్ పోలీసింగ్ ద్వారా పోలీసులు ప్రజల మధ్య ఉంటూ వారికి రక్షణ కల్పిస్తున్నారు. ప్రజలు భద్రతకు సంబంధించి ఏవైనా సమస్యలు ఎదుర్కొంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచిస్తున్నారు.

మురుగునీటితో ఇబ్బందిపడుతున్న ప్రజలు



మురుగునీరు నిలిచి ఉన్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీపీఎం బృందం

కడప సెవెన్ రోడ్స్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కడప నగరం 49వ డివిజన్ అలంఖాన్‌పల్లె పరిధిలో ఉన్న దస్తగిరిపేటలో శ్మశానం నుంచి వచ్చే మురుగునీటితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం కడప నగర కార్యదర్శి ఎ.రామమోహన్ తెలిపారు. మురుగునీటితో ఇబ్బందిపడుతున్న ప్రాంతాన్ని ఆదివారం సీపీఎం ప్రతినిధి బృందం పరిశీలించారు. రామ్మోహన్ మాట్లాడుతూ దస్తగిరిపేట ఏర్పడి 40ఏళ్లు అవుతోందని, ఈ ప్రాంతం ప్రజలు అన్ని రకాల పన్నులు కడుతున్నారని, ఈ ప్రాంతం పట్ల కార్పొరేషన్ పాలకవర్గం అభివృద్ధిలో వివక్ష చూపడంసరైంది కాదన్నారు. పక్కనే శ్మశానవాటిక ఉందని, అక్కడ నుంచి డ్రైనేజీ,మురుగునీరు దస్తగిరిపేటలో ప్రవహించడం వలన పాములు, విషపురుగులు ఇళ్లలోకి వస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నగరనాయకులు దస్తగిరిరెడ్డి, చంద్రారెడ్డి, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

శాంతి సమాజ స్థాపనే మానవత ధ్యేయం



మాట్లాడుతున్న మానవతా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రామచంద్రారెడ్డి

చెన్నూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): శాంతి సమాజ స్థాపనే మానవత ధ్యేయమని వ్యవస్థాపక అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మానవతా సంస్థ చెన్నూరు మండల నూతన కార్యవర్గప్రమాణ స్వీకార సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దుఃఖంలో ఉన్న వారి ఒక్కకన్నీటి బొట్టు అయినా తుడిచి కష్టాన్ని తీర్చడమే సంస్థ ఉద్దేశ్యమన్నారు. ఇదే గాక రక్తదానశిబిరాలు, పర్యావరణానికి మొక్కలు నాటడం లాంటివి చేపట్టడం జరుగుతుదన్నారు. అనంతరం నూతనకార్యవర్గం చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఇందులో అధ్యక్షుడుగా లేవాకు సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షుడిగా సదాశివరెడ్డి, కార్యదర్శిగా కార్తీకరెడ్డి, అనుబంధ కార్యదర్శి తుంగ చంద్రయాదవ్, కోశాధికారిగా నారాయణరెడ్డి, సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో మానవతా సంస్థ రాష్ట్ర డైరెక్టర్లు, జిల్లా అధ్యక్ష లు రాటాల గోపి, ఎ.రామాంజులరెడ్డి, సుబ్బరాయుడు, రెడ్డమ్మ, జయచంద్రారెడ్డి, వెంకటరామిరెడ్డి, బ్రహ్మానంద రెడ్డి, ఆటోబాబు, పూర్వపు అధ్యక్షుడు ఆవుల బసిరెడ్డి, జీఎన్ భాస్కర్‌రెడ్డి, జయభారత్‌రెడ్డి, కె.విజయభాస్కర్‌రెడ్డి, ఐ.శివారెడ్డి, ఎంపీపీ చీర్లసురేశ్‌బాబు పాల్గొన్నారు. కాగా నిత్యం అందుబాటులో ఉంటూ ఏ సమయంలో అయినా మానవతా సంస్థ ప్రజా సేవలో నిత్యం ఉంది అని సేవ చేసే ఆటోబాబు (సందు సురేశ్‌బాబు)ను సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అభినందించారు.

వంద సంవత్సరాలుగా విజయపరంపర



పులివెందులలో మాట్లాడుతున్న కత్తి రామచంద్రారెడ్డి

పులివెందుల రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): వంద సంవత్సరాలుగా ఆర్ఎస్ఎస్ విజయపరంపర కొనసాగిస్తోందని ఆర్ఎస్ఎస్ విభాగకార్యవాహ కత్తి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పులివెందులలోని సరస్వతి విద్యామందిరం పాఠశాల మైదానంలో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విజయదశమి ఉత్సవం నిర్వహించారు. అనంతరం ఆయుధ పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సరస్వతి విద్యామందిరం పాఠశాల కమిటీ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్, ఆర్ఎస్ఎస్ ఖండ కార్యవాహ సర్వేశ్వర్‌రెడ్డి, హిందూ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సింహాద్రిపురం..: హిందూ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడడంలో ఆర్ఎస్ఎస్ కీలక పాత్ర పోషిస్తోందని ఆర్ఎస్ఎస్ ప్రముఖ్ శ్రీనాథరెడ్డి అన్నారు. మండలంలోని బలపనూరులో ఆదివారం సాయంత్రం ఆర్ఎస్ఎస్ శత జయంతి విజయదశమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ వంగల శశిభూషణ్‌రెడ్డి, హరికృష్ణ, లక్ష్మీనారాయణరెడ్డి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

శిల్పారామంలో ఆటపాట



కడప కల్చరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): నగర రిమ్స్ సమీప శిల్పారామంలో ఆదివారం ఆటవిడుపు కార్యక్రమంలో భాగంగా అక్కడ సాంస్కృతిక కళావేదికపై కడపకు చెందిన సర్వేశ్వర డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు సినిమా, జానపద, శాస్త్రీయ నృత్యాలతో ఆటపాట ఎంతో అలరించింది. కార్యక్రమంలో వస్తావా జానకి, ఇస్మార్ట్‌శంకర్, రాను బొంబాయికి రాను అనే పాటలకు విద్యార్థులు చేసిన స్టెప్స్ అదరహో అనిపించాయి.

గంగమ్మకు పూజలు




సీకేదిన్నె, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): చింతకొమ్మదిన్నె గంగమ్మ తల్లికి భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వారి కోరిన కోర్కెలు నెరవేరడంతో భక్తులు ఆనందంగా అమ్మవారికి కానుకలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేయించారు. అనంతరం అమ్మవారి సన్నిధిలో బంధుమిత్రులతో కలిసి విందు భోజనాలు ఏర్పాటు చేసుకుని ఆనందంగా గడిపారు. సమీపంలోని వీరభద్రస్వామి, సాయిబాబా, శివాలయం, ఆంజనేయస్వామి, అక్కదేవతల ఆలయాల్లో పూజలు నిర్వహించారు.

పుట్టా చేసిన అభివృద్ధి చూడలేకనే విమర్శలు

మైదుకూరు రూరల్,అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి):మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధిని చూడలేకనే మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి విమర్శలు చేస్తున్నారని మార్కెట్ కమిటీ చైర్మన్ ఏపీ రవీంద్ర ఘాటుగా విమర్శించారు. స్థానిక మార్కెట్‌కమిటీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రవీంద్ర మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి గతంలో టీడీపీలో ఉన్నప్పుడు మైదుకూరు నియోజకవర్గంలో ఎన్టీఆర్ విగ్రహం ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. ఉల్లి రైతులకు న్యాయం చేసేందుకు ఎమ్మెల్యే పుట్టా ఉన్నతాధికారులతో మాట్లాడుతున్నారన్నా రు.

అక్రమంగా తొలగించారు న్యాయం చేయండి

మైదుకూరు రూరల్,అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి) : ఊరు పుట్టినప్పటి నుంచి మైదుకూరు మండలంలోని ఉత్సలవరం గ్రామంలో వెలసిన రామాలయంలో పూజలు నిర్వహిస్తున్న తనను అక్రమంగా తొలగించారని న్యాయం చేయాలని పూజారి శ్రీనివాసులు వేడుకుంటున్నారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మా తాత, మా నాన్న, నేను ఇదే ఆలయంలో పూజలు చేస్తునే ఉన్నామన్నారు. తనకు జరిగిన అన్యాయంపై పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేదన్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నాడు.



గ్రామాల్లో ప్రశాంతత నెలకొల్పేందుకే పల్లెనిద్ర


ప్రజలతో మాట్లాడుతున్న సీఐ విశ్వనాథరెడ్డి

ఎర్రగుంట్ల, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఫ్యాక్షన్ పల్లెల్లో ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పేందుకే పల్లెనిద్ర కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినటు సీఐ విశ్వనాథరెడ్డి తెలిపారు. శుక్రవారం రాత్రి ఫ్యాక్షన్ గ్రామమైన వై.కోడూరులో ఎస్ఐ నాగమురళి, సిబ్బంతో కలిసి ఆయన పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో రాత్రి ప్రజలతో ఆయన సమావేశం నిర్వహించి గ్రామంలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సమస్యలున్నా ప్రశాంత వాతావరణంలో సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. ఫ్యాక్షన్ వల్ల నష్టాలు, కష్టాలే తప్ప ఎలాంటి ప్రయోజనాలు ఉండవన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి వాసుదేవరెడ్డి, ఉపమండలాధ్యక్షుడు మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాల బలోపేతానికి కృషి చేయాలి


కార్యకర్తలతో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్

అట్లూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల బలోపేతానికి రైతులు సహకరించాలని డీసీసీబీ చైర్మన్ మంచూరి సూర్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. అట్లూరు మండలంలోని దత్తాయపల్లె గ్రామంలో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైన ఆయన రైతులు పార్టీ కార్యకర్తలతో సమావేశమై మాట్లాడా రు. ప్రభుత్వం మూడో విడత సీసీ రోడ్లు డ్రైనేజీలకు పనులు మంజూరయ్యాయని వెంటనే పనులు చేపట్టాలని కార్యకర్తలకు సూచించారు. అలాగే మండలంలో రైతులకు పంట రుణాలు, దీర్ఘకాలిక రుణాలు మంజూరు చేసేందుకు బ్యాంకులు సిద్ధంగా ఉన్నాయన్నారు. ప్రాథమిక సహకార పరపతి సంఘాల్లో రైతులు సకాలంలో వడ్డీ రుణాలు చెల్లించి కొత్త రుణాలు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మం డల టీడీపీ నాయకుడు ఆరవ శ్రీనివాసులరెడ్డి, సొసైటీ డైరెక్టరు పాటూరు రాధాక్రిష్ణారెడ్డి, అల్లం వెంకటసుబ్బయ్య, గంగిరెడ్డి, చిన్న గంగిరెడ్డి, గురు ప్రసాద్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, నరసింహారెడ్డి, గోపాల్‌రెడ్డి, గుర్విరెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.

సామాజిక సేవలో రోటరీ సంస్థ

ముద్దనూరు అక్టోబర్12(ఆంధ్రజ్యోతి):రోటరీ సంస్థ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు జమ్మలమడుగు రోటరీ క్లబ్ రోటరీ జిల్లా గవర్నర్ కె.రవీంద్ర పేర్కొన్నారు. మండల పరిధి కోడిగాండ్లపల్లె సమీపంలోని మానసిక వికలాంగుల ఆశ్రమం(యేసుకరుణాలయం)లోని మానసిక వికలాంగులకు ఆదివారం జమ్మలమడుగు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బ్రెడ్లు, పండ్లు,బియ్యం ప్యాకెట్లు, రూ.5వేలు ఆర్థిక సహాయం అందించారు ఈ కార్యక్రమంలో రోటరీ అసిస్టెంట్ గవర్నర్ మురళీధర్‌రెడ్డి, రోటరీ క్లబ్ అధ్యక్షుడు మారెడ్డి వెంకటక్రిష్ణారెడ్డి, జోనల్ సెక్రటరీ కుండా భాస్కర్,ట్రెజరర్ ఓబుల్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

మహాకవిగా వేంకటశేషశాస్త్రి ఆదర్శమూర్తి

● విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి


గడియారం వేంకటశేషశాస్త్రి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి):మహాకవిగా గడియారం వేంకటశేషశాస్త్రి అందరికీ ఆదర్శమని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. స్థానిక వైఎంఆర్ కాలనీ మున్సిపల్ పార్కులో ఆదివారం మహాకవి డాక్టర్ గడియారం వేంకటశేషశాస్త్రి విగ్రహాన్ని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడియారం వెంకటశేషశాస్త్రి రచించిన శివభారతం మహాకావ్యం ఆయనకు ఎంతో కీర్తిప్రతిష్ఠలు తెచ్చిపెట్టిందన్నారు. తాను అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలులో చదువుకునే సమయంలో గడియారం వారు తెలుగుబోధించేవారని ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించడం గర్వంగా ఉందన్నారు. అనంతరం గోసంరక్షణపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు బహుమతులు, మెమెంటోలను అందజేశారు. కార్యక్రమంలో ప్రానమణి బిరుదాంకితుడు అన్నదాత సుబ్రమణ్యం, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, శివభారతి విద్యాపీఠం అధ్యక్షుడు గడియారం నాగేశ్వర శర్మ, కార్యదర్శి గడియారం వెంకటశేషశర్మ, ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, గడియారం సాహితీపీఠం అధ్యక్షుడు డాక్టర్ ఎంఎల్‌నారాయణరెడ్డి, గడియారం కుటుంబీకులు, సాహితీవేత్తలు, కౌన్సిలర్ మురళీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సమైక్యంగా పోరాడాలి


ఎంప్లాయీస్ యూనియన్‌లో చేరిన నేషనల్ మజ్దూర్ యూనియన్ కార్మికులు

జమ్మలమడుగు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ప్రతి కార్మికుడు సమైక్యంగా పోరాటం చేయాల్సి ఉంటుందని ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం జమ్మలమడుగులోని వాసవీ కల్యాణ మండపంలో ఎంప్లాయీ స్ యూనియన్ జమ్మలమడుగు డిపో సర్వసభ్య సమావేశం డిపో కార్యదర్శి ఫాజిల్‌బాషా, అధ్యక్షుడు గంగిరెడ్డి ఆధ్వర్యంలో అధ్యక్షతన జరిగింది. ముందుగా జమ్మలమడుగు ఆర్టీసీ డిపోలో నేషనల్ మజ్దూర్ యూనిటీ డిపో కార్యదర్శి కె.శివుడు ఆధ్వర్యంలో 30 మంది ఉద్యోగులు ఎంప్లాయీస్ యూనియన్‌లో చేరారు. వారికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోసుబాబు, రామమూర్తి, ఎంప్లాయీస్ యూనియన్ కండువాలు కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. .

నూతన కమిటీ ఎన్నిక: జమ్మలమడుగు ఆర్టీసీ డిపో నూతన కమిటీని ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డిపో అధ్యక్షుడుగా ఆర్. గంగిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా డీవీరెడ్డి, ఉపాధ్యక్షుడుగా ఫాజల్‌బాష, డిపో కార్యదర్శిగా కె.శివుడు, సెక్రటరీగా శేఖర్, గ్యారేజీ సెక్రటరి బీసీఆర్ఎస్.రెడ్డిలతోపాటు మరో 10 మందిని డిపో కమిటీలోకి ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలియజేశారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన


రోగులను పరిక్షీస్తున్న వైద్యులు

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెంకటేశ్వర్లుపేట సరస్వతీ విద్యామందిరంలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఆదివారం అనంతపురం కిమ్స్ సవేరా ఆస్పత్రుల ఆధ్వర్యంలో రోగులకు షుగర్, బీపీ, ఈసీజీ, టుడీఏకో పరీక్షలు నిర్వహించారు. కార్డియాలజిస్టు డాక్టర్ మేఘన, న్యూరాలజిస్టు డాక్టర్ నితీష్‌లు రోగులను పరీక్షించారు. 10 మందికి గుండె చికిత్స అవసరమని వారికి సూచించారు. 159 మంది రోగులు వైద్యశిబిరంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మానవతా సంస్థ చైర్మన్ వంకధార కళావతి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

బద్వేలు , అక్టోబర్ 12 (ఆంధ్రజ్యోతి) :విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 15 వతేదినుంచి జరిగే విద్యుత్ ఉద్యోగుల సమ్మెకు ప్రతి ఒక్కరూ సంఘీభావం తెలపాలని సీపీఐఎంఎల్ లిబరేషన్ జిల్లా నాయకుడు చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానికపార్టీ కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జకరయ్య, అనిల్, బాబు పాల్గొన్నారు. విద్యుత్ ఉద్యోగులు కాంట్రాక్ట్‌ఉద్యోగులు సమస్యల పరిష్కారం కోసం జరిగే సమ్మెకు పార్టీలకు అతీతంగా అందరూ మద్ధతు ఇచ్చి జయప్రదం చేయాలని యూనియన్ సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కార్మిక వర్గ శ్రేయస్సుకోసం విద్యుత్ రంగంలో జరిగే సమ్మెకు కేంద్రకార్మిక సంఘా లు, ప్రజా సంఘాలు మద్ధతు ఇవ్వాలన్నారు. సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

ఆలయాలకు సిమెంట్ బెంచీలు వితరణ

కలసపాడు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, ఎస్టీయూ జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి ఎస్వీ సత్యనారాయణ సామాజిక సేవలో భాగంగా రెండు ఆలయాలకు ఆదివారం సిమెంట్ బెంచీలను వితరణ చేశారు. కలసపాడులోని అభయాంజనేయస్వామి ఆలయంతోపాటు అంకాళమ్మ ఆలయం, తాటిచెర్ల మోటు శ్రీలక్ష్మీనరసింహాస్వామి ఆలయం వద్ద రూ.61000 విలువైన సిమెంట్ బెంచీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

ముఖ్యమంత్రిగా చంద్రబాబు అరుదైన రికార్డు


కేక్ కట్ చేస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): 15 ఏళ్ల ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు దక్షిణ భారత దేశంలో అరుదైన రికార్డును సృష్టించారని నందమూరి యువసేవా సమితి అధ్యక్షుడు గోమేదికం సుదర్శన్ పేర్కొన్నారు. 15 సంవత్సరాలు ముఖ్యమంత్రి పదవీ కాలాన్ని చంద్రబాబునాయుడు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.గురప్పయాదవ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సీఎంకు శుభాకాంక్షలు తెలిపారు. తెలుగుయువత జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి రామూనాయుడు, వెంకటసుబ్బయ్య, నాగభూషణం, చాంద్ బాష, నాయకులు పాల్గొన్నారు.

గోడౌన్లలో పోలీసు తనిఖీలు

మైదుకూరు అక్టోబరు12(ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ ఆదేశాలమేరకు మైదుకూరు పట్టణంలోని ట్రాన్స్‌పోర్టు కార్యాలయాలు, ఆర్‌టీసీ కార్గో సర్వీసులలో, గోడౌన్లలో ఆదివారం సీఐ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిల్లాలో గంజాయి, ఇతర నిషేధిత మత్తు పదార్థాలను కట్టడి చేసే క్రమంలో తనిఖీలు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మ రథోత్సవం

బ్రహ్మంగారిమఠం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): కాలజ్ఞాన కర్త పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి సజీవ సమాధి నిష్ఠ వహించిన బ్రహ్మంగారి మఠం దేవస్థానం అనుసంధానంలోని కనుమ పోలేరమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం అమ్మవారి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. దేవదాయశాఖ కమిషనరు ఆధ్వర్యంలో రథోత్సవం నిర్వ హించినట్లు మేనేజరు ఈశ్వరయ్య ఆచారి తెలిపారు. ఉభయదాత వీరయ్య ఆధ్వర్యంలో రథోత్సవాన్ని నిర్వహించారు.







